

క్యాన్సర్ పరీక్షల్లో అలసత్వం వద్దు
క్యాన్సర్ పరీక్షల నిర్వహణలో అలసత్వం వద్దని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. - 10లో



భక్తిశ్రద్ధలతో పడిమెట్ల పూజోత్సవం
ఎర్రాతివారిపల్లెలోని కోటమల్లై అయ్యప్ప స్వామి ఆలయంలో పడిమెట్ల పూజోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. - 10లో



31లోపు సిలబస్ పూర్తి చేయాలి
ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఈ నెల 31వ తేదీ లోపు సిలబస్ పూర్తి చేయాలని డీఈఓ వరలక్ష్మి ఆదేశించారు. - 10లో

న్యూస్‌రీల్

పంచాయతీ కార్యదర్శుల సస్పెన్షన్

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలోని ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ సస్పెండ్ చేశారని డీపీఓ సుధాకర్‌రావు గురువారం తెలిపారు. రామకుప్పం, శాంతిపురం మండలాల్లో పనిచేస్తున్న సాదిక్‌అలీ, బంగారునాయక్ ప్రైవేటు వ్యక్తులకు డిజిటల్ కీని ఇచ్చి, నిధులు దుర్వినియోగం చేశారన్నారు. ఆ ప్రైవేటు వ్యక్తులు ఆ కీని ఉపయోగించి వందలాది తప్పుడు జనన ధ్రువీకరణ పత్రాలను సృష్టించి, అమ్ముకున్నారన్నారు. దీనిపై విచారణ జరిపి కలెక్టర్‌కు నివేదించామన్నారు. ఆయన వారిని సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారని తెలిపారు.

జాతీయస్థాయి వేమన పద్యాల పోటీ

పలమనేరు: వేమన జయంతి సందర్భంగా జాతీయ వేమన పద్యాల పోటీలను వచ్చే జనవరి 18వ తేదీన నిర్వహించనున్నట్టు స్థానిక తెలుగు సాహితీ సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వందకు పైగా వేమన పద్యాలను చెప్పగలికే పిల్లలు జనవరి 5లోపు తమ పేర్లను 95534 29770 నంబర్‌కు వాట్సాప్ ద్వారా నమోదు చేసుకోవాలని తెలిపారు. గెలుపొందిన పిల్లలకు అదే రోజు బహుమతులను ప్రదానం చేయనున్నట్టు పేర్కొన్నారు.

నేర నియంత్రణకు కృషి చేయండి

–ఎస్పీ మణికంఠ చందోలు



కమాండ్ అండ్ కంట్రోల్ రూమును ప్రారంభిస్తున్న ఎస్పీ

వి.కోట: మూడు రాష్ట్రాల కూడలి అయిన వి.కోటలో నేరాల నియంత్రణకు పోలీసులు కృషి చేయాలని జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు అన్నారు. గురువారం వి.కోట పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. పలమనేరు డీఎస్పీ సుధాకర్ నేతృత్వంలో సీఐ సోమశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్పీకి పోలీసులు గౌరవ వందనం సమర్పించి, స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన అమాయాక్ష్ అధినేత దశరథరెడ్డి సహకారంతో రూ.10 లక్షల వ్యయంతో పట్టణంలో అమర్చిన అధునాతన టెక్నాలజీ సీసీ కెమెరాల కంట్రోల్ రూమ్‌ను ఎస్పీ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పట్టణంలో అడుగడుగున పోలీసు నిఘా ఉంటుందని, వాహన ప్రమాదాలతో పాటు వాహనాలు, ఇతర చోరీలు, అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ, కొత్త వ్యక్తుల సంచారంపై నిరంతరం నిఘా ఉండడంతో నేరాల నియంత్రణ సాధ్యం అవుతుందన్నారు. అనంతరం ఎస్పీ స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలమనేరు డీఎస్పీ ప్రభాకర్, వి.కోట సీఐ సోమశేఖర్‌రెడ్డి, ఎస్ఐ బాబు, ఏఎస్ఐలు జయకృష్ణ, మురళి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

42 యూనిట్ల విద్యుత్‌కు రూ.20,800 బిల్లు



రూ 20,800 చెల్లించాలని డిసెంబర్‌లో ఇచ్చిన విద్యుత్ బిల్లు



రూ 20,800 విద్యుత్ బిల్లు వచ్చిన ఇల్లు(ఇన్‌సెట్) బాధితుడు గజ్జల రమేష్

శాంతిపురం మండలంలోని ఎంకే పురానికి చెందిన గజ్జల రమేష్‌కు చెందిన పొలం వద్ద ఉన్న ఇంటికి కుప్పం రెస్కో సర్వీసు నంబర్ 698 కింద విద్యుత్ కనెక్షన్ ఉంది. ఊర్లో మరో ఇల్లు ఉండడంతో అక్కడ కాపురం ఉంటూ, పొలంలోని ఇంటి వద్ద రాత్రుల్లో పశువులను కట్టి ఉంచుతున్నారు. ఈ ఇంట్లోని 9 వాట్ల బల్బును రాత్రి పాలు పితికే సమయంలో గంట సేపటి వరకూ వేసి, ఆపి వేస్తారు. బయట ఉన్న 6 వాట్స్ బల్బును రాత్రంతా వేసి, ఉంచుతారు. దీనికి నెలసరి 20 యూనిట్లలోపు మాత్రమే విద్యుత్‌ను వినియోగిస్తారు. గత జూన్ 21వ తేదీ వరకూ మీటర్ రీడింగ్ 2,149 యూనిట్లతో పాత బకాయిలతో సహా ఆ నెలలో వాడిన 21 యూనిట్లకు విద్యుత్ బిల్లు బకాయి రూ.775 ఉండదంతో జూలై 5న రూ.800 రమేష్ చెల్లించాడు. కానీ తాజాగా ఈ నెల 4వ తేదీన ఇచ్చిన బిల్లులో మీటర్ రీడింగ్ 2,191 యూనిట్ల రీడింగుతో మొత్తం 42 యూనిట్లకు గాను రూ 20,800 విద్యుత్ బిల్లు వచ్చింది. దీనిని చూసి, అవాక్కైన లబ్దిదారుడు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసి, తనకు న్యాయం చేయాలని రెస్కో అధికారుల చుట్టూ తిరుగుతున్నాడు.



"ఈయన పేరు లోకనాథరెడ్డి. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని కార్వేటినగరం, అన్నూరు గ్రామం. గత రెండు నెలలతో పోలిస్తే ఈసారి విద్యుత్ బిల్లు రూ.442 వచ్చింది. అసలే చలికాలం. ఇటీవల వరుస తుపానులు. రాత్రులు కూడా పెద్దగా ఫ్యాన్లు వేసుకోలేదు. అలాంటిది విద్యుత్ బిల్లు గతనెల వచ్చిన దానికంటే ఇంకా తగ్గాలే తప్ప.. గత నెల రూ.300 లోపు వస్తే, ఇపుడు రూ.442 వచ్చిందేమిటని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు."



"ఇది పలమనేరు నియోజకవర్గంలోని వి.కోటకు చెందిన రఘువరప్రసాద్‌కు చెందిన విద్యుత్‌బిల్లు. గతనెల రూ.500 వచ్చిన విద్యుత్ బిల్లు.. ఈ నెల చలికాలమైన ప్పటికీ, విద్యుత్‌ను పెద్దగా ఉపయోగించకున్నా.. రూ.591 వచ్చింది. ఏమిటని చూస్తే రెండు దఫాల్లో ఇంధన సర్దుబాటు చార్జీల రూపంలో రూ.104 అదనంగా వసూలు చేశారు."



బేజులరెడ్డికి సంబంధించిన విద్యుత్ బిల్లు



జేజులరెడ్డి నివాసం ఉన్న ఇల్లు

"చిత్తూరు నగరానికి చెందిన జేజులరెడ్డి నివాసం విద్యుత్ సర్వీసు నంబర్ 3457. ఈయన ఇంట్లో రెండు ఫ్యాన్లు, మూడు ట్యూబ్‌లైట్లు, టీవీ ఉంది. రాత్రి సమయంలో కుటుంబమంతా ఇంట్లోనే ఉండడంతో విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటుంది. మిగిలిన సమయంలో పెద్దగా ఉపయోగించరు. గతనెల 151 యూనిట్లు వాడినందుకు ఏకంగా రూ.758 బిల్లు ఇచ్చారు. ఇందులో విద్యుత్ వాడకం కింద రూ.573, ఇంధన సర్దుబాటు చార్జీ రూ.75.20, మిగిలిన చార్జీల కింద రూ.109 కలిపి మొత్తం రూ.758 బిల్లు ఇచ్చారు. డిసెంబర్‌లో వచ్చిన బిల్లులో 190 యూనిట్లు వాడినందుకు రూ.1,139 బిల్లు ఇచ్చారు. అందులో విద్యుత్ వాడకానికి రూ.807 ఉండగా ఇంధన సర్దుబాటు చార్జీనే రెండు విడతలుగా కలిపి రూ.195 ఉంది. ఇతర చార్జీలు కింద రూ.136.87 లెక్కన బిల్లు వచ్చింది. ఇదేమిటని చూసుకుంటే 2022 ఏప్రిల్‌లో వాడిన విద్యుత్‌కు ఇంధన సర్దుబాటు చార్జీల కింద రూ.134.73 వడ్డించారు."

అధికారంలోకి వస్తే అందరినీ ఆదరిస్తాం.. విద్యుత్ భారం తగ్గిస్తాం.. ఐదేళ్లపాటు ఒక్క రూపాయి కూడా విద్యుత్ చార్జీలు పెంచం.. ఇదీ ఎన్నికల ముందు బాబు ఇచ్చిన హామీ.. గద్దెనెక్కాడు.. ఆరునెలలు కూడా పూర్తి కాకనే సామాన్యుడికి సర్దుపోటు పొడిచాడు.. దీంతో విద్యుత్ వినియోగదారుడు విలవిల్లాడుతున్నాడు.. అతడికి అండగా నిలవాలని వైఎస్సార్ సీపీ తలచింది. సామాన్య, మధ్య తరగతి గొంతుకై.. సర్దుపోటుపై నిగ్గదీసి కడిగేయాలని నిర్ణయించింది. అందుకే జనం పక్షాన సర్దుపోటుపై పోరుబాటకు సిద్ధమైంది.



కరెంట్ చార్జీల బాదుడుపై వైఎస్సార్ సీపీ పోరుబాట పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా, పార్టీ నేతలు, కార్యకర్తలు

పోటుపై పోరు



చిత్తూరు అర్బన్: మాట ఇస్తే దానిపై నిలబడాలి. లేకుంటే ఆ మాట ఊసే ఎత్తకూడదు. కానీ రాష్ట్రంలో కొలువుదీరిన కూటమి ప్రభుత్వం మాట ఇవ్వడం, ఆపై దాన్నే దాటేయడం జరిగిపోతున్నాయి. సూపర్‌సిక్స్ జాడలేదు. మ్యానిఫెస్టో ఊసేలేదు. పైగా అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు రూపాయి కూడా పెంచమంటూ వాగ్దానం చేసి, అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లోనే ఇంధన సర్దుబాటు చార్జీల పేరిట సామాన్యుడి నెత్తిన రూ.కోట్ల భారం మోపింది. మాట తప్పిన సర్కారు బాధ్యతను గుర్తుచేస్తూ ప్రజల పక్షాన నిలిచిన ప్రతిపక్షం పోరు బాటకు సిద్ధమైంది. పెంచిన విద్యుత్ చార్జీలను నిరసిస్తూ శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు, నిరసన కార్యక్రమాలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సైన్యం పిలుపునిచ్చింది.

నేడు జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిరసనలు

- సర్దుబాటు చార్జీల పేరిట ప్రజల నెత్తిన రూ.5 కోట్ల భారం
- విద్యుత్ చార్జీలు పెంచమంటూనే.. బాగబెట్టిన ప్రభుత్వం
- అల్లాడి పోతున్న సామాన్యులు.. చోద్యం చూస్తున్న సర్కారు
- 2026 జనవరి వరకు ప్రజలు భారం మోయాల్సిందే
- కూటమి ప్రభుత్వ 'మోత'ను ఎండగట్టనున్న ప్రతిపక్షం

జిల్లాలో పోరుబాట ఇలా..

- కుప్పంలో ఆర్టీసీ బస్టాండ్ రోడ్డు నుంచి ప్యాలస్ రోడ్డు మీదుగా రెస్కో కార్యాలయం వరకు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ భరత ఆధ్వర్యంలో బైకు ర్యాలీ జరుగుతుంది. పార్టీ కార్యకర్తలతో కలిసి రెస్కో కార్యాలయాన్ని ముట్టడిస్తారు. అధికారులకు వినతిపత్రం అందజేస్తారు.
- పుంగనూరులో వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఇద్దరూ కలిసి విద్యుత్ చార్జీల పెంపుపై చేపట్టనున్న నిరసన ర్యాలీలో పాల్గొంటారు. పుంగనూరులోని దివంగత నేత వైఎస్సార్ విగ్రహం నుంచి ర్యాలీ ప్రారంభించి, పీఎల్‌ఆర్ రోడ్డు మీదుగా ట్రాన్స్‌కో కార్యాలయం వరకు బైకు ర్యాలీ జరుగుతుంది. ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి, ఆపై అధికారులకు వినతి పత్రం ఇస్తారు.
- జిల్లా కేంద్రమైన చిత్తూరులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ఎంసీ విజయానందరెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 9.30 గంటలకు కట్టమంచి చెరువు వద్ద ఉన్న వివేకానందుని విగ్రహం నుంచి స్కూటర్ ర్యాలీ ప్రారంభమవుతుంది. స్కావెంజర్స్ కాలనీ, జిల్లా కోర్టు సముదాయాల రోడ్డు, గాంధీ రోడ్డు మీదుగా ర్యాలీ సాగి.. అక్కడున్న ట్రాన్స్‌కో డీఈ కార్యాలయానికి చేరుకుని, నిరసన వ్యక్తం చేస్తారు. అధికారులకు వినతిపత్రం అందజేస్తారు.
- నగరి నియోజకవర్గంలో మాజీ మంత్రి ఆర్కే రోజా ఆధ్వర్యంలో పుత్తూరులోని ఆరిమాకులమ్మ ఆలయం వద్ద ఉదయం 10 గంటలకు బైకు ర్యాలీ ప్రారంభిస్తారు. భవానీనగర్ వరకు ర్యాలీ కొనసాగుతుంది. అనంతరం ఏపీఎస్పీడీసీఎల్ డీఈ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి, అధికారులకు వినతిపత్రం ఇస్తారు.
- పూతలపట్టులో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు అంబేద్కర్ విగ్రహం నుంచి బైకు ర్యాలీ ప్రారంభిస్తారు. పూతలపట్టు మండలకేంద్రంలో ఉన్న ఏపీఎస్పీడీసీఎల్ ఏఈ కార్యాలయం ఎదుట బైఠాయించి, నిరసన వ్యక్తం చేస్తారు.
- పలమనేరులో వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ వెంకటే గౌడ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం నుంచి ప్రారంభమయ్యే బైకు ర్యాలీ ఏటీఎం సర్కిల్ మీదుగా రంగబాబు సర్కిల్ దాటుకుని ట్రాన్స్‌కో ఏడీ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగుతుంది. ఆపై అధికారులకు వినతి పత్రం అందజేస్తారు.
- గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో పార్టీ సమన్వయకర్త కృపాలక్ష్మి ఆధ్వర్యంలో విద్యుత్ చార్జీల పెంపుపై ఏపీఎస్పీడీసీఎల్ కార్యాలయ ముట్టడి జరుగుతుంది. కార్వేటినగరంలోని వేణుగోపాలస్వామి ఆర్చి నుంచి ప్రారంభమయ్యే బైకు ర్యాలీ మండల సముదాయంలోని ఏపీఎస్పీడీసీఎల్ కార్యాలయం వద్దకు చేరుకుని, ముట్టడి జరుగుతుంది.

ప్రజల పక్షాన పోరాటం

కూటమి ప్రభుత్వం చేస్తున్న ఈ దోపిడీని ప్రశ్నిస్తూ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించడానికి పిలుపునిచ్చారు. ప్రజల పక్షాన నిలబడి, ప్రజల ఆవేదనను ప్రశ్నించే గొంతుక కావాలని వైఎస్ జగన్ ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో ఆందోళనలు చేయనున్నారు. పార్టీ కార్యకర్తలు, సామాన్యులతో కలిసి ట్రాన్స్‌కో కార్యాలయాల వద్ద నిరసన వ్యక్తం చేయడానికి పార్టీ క్యాడర్ సిద్ధమవుతోంది.

జనంపై రూ.5 కోట్ల భారం

జిల్లాలో గృహ, వాణిజ్య విద్యుత్ సర్వీసులన్నీ కలిపి 5.61 లక్షల వరకు ఉన్నాయి. 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు ఉపయోగించిన విద్యుత్‌కు కూటమి ప్రభుత్వం ఇంధన సర్దుబాటు చార్జీల రూపం ఈ ఏడాది నవంబర్ బిల్లు నుంచి జనం నెత్తిన అదనపు భారాన్ని మోపుతోంది. అప్పట్లో వాడిన ప్రతి యూనిట్ విద్యుత్‌కు 60 పైసల నుంచి 83 పైసల వరకు ప్రస్తుతం వస్తున్న నెలసరి బిల్లుల్లో అదనంగా కలుపుతున్నారు. ఒకేసారి మొత్తం వసూలు చేస్తే జనం నుంచి వ్యతిరేకత ఒక్కసారిగా ఉవ్వెత్తున ఎగసి పడుతుందని గ్రహించి.. ప్రతినెలా రూ.30 నుంచి రూ.వందపైగా అదనంగా బిల్లుల్లో కలుపుతోంది. 2026 జనవరి వరకు ఇలా ఇంధన సర్దుబాటు చార్జీలను వసూలు చేయనున్నారు. ఇలా అత్యధికంగా ఒక్కో వినియోగదారుడికి ప్రతి నెలా రూ.500 అదనపు భారం పడుతోంది. అంటే ప్రతి నెలా జిల్లా ప్రజల నుంచి కూటమి ప్రభుత్వం ఇంధన సర్దుబాటు చార్జీల రూపంలో రూ.5 కోట్లు కొల్లగొట్టనుందన్నమాట.

పార్టీకి పూర్వవైభవం తీసుకువద్దాం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి

- నగరి వేదికగా వైఎస్సార్ సీపీ శ్రేణులకు నేతల దిశానిర్దేశం

నగరి: పార్టీకి మళ్లీ పూర్వవైభవం తీసుకువద్దామని చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఏజేఎస్ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన పార్టీ నియోజకవర్గస్థాయి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అంటే అల్లాటప్ప పార్టీ కాదన్నారు. నిఖార్సయిన పార్టీ అని, వేధింపులకు భయపడని పార్టీ అని అన్నారు. పార్టీ అధినేత జగన్ మోహన్ రెడ్డి లాంటి నాయకుడు ప్రపంచ రాజకీయాల్లో ఎక్కడా లేరని, ఎందెందు వెదికినా దొరకరన్నారు. ఇది మాటల కోసం చెప్పే విషయం కాదని, అది ఆయన స్వయంగా నిరూపించుకున్నారన్నారు. అలాంటి నాయకుడి వద్ద మనం పనిచేస్తున్నామంటే భయం మన దరిదాపుల్లోకి కూడా రాకూడదన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన ఆరునెలలకే ప్రజల్లో తేలిపోయిందన్నారు. రూ.2 లక్షల కోట్లయ్యే హామీలిచ్చి జగనన్న అమలు చేసిన పథకాలు కూడా ఇవ్వలేని అసమర్థ ప్రభుత్వం టీడీపీ ప్రభుత్వమన్నారు. వివాహానంతరం పారాణి ఎండి పోయినట్లు టీడీపీ అధికార పారాణి ఆరు నెలలకే ఎండిపోయిందన్నారు. దానికి ఇంక మనుగడ లేదన్నారు. కూకటి వేళ్లతో పీకేసే రోజు త్వరలో ఉందన్నారు.

ఆశలపల్లకి నరకపు వాకిలి చూపుతోంది

ఎన్నికల ముందు పచ్చనేతలు సూపర్‌సిక్స్ అంటూ చూపిన ఆశలపల్లకిలో జనం ఎక్కేశారని అయితే ఆ పల్లకి ఇప్పుడు వారికి నరకపు వాకిలి చూపుతోందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్కేరోజా అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తప్పులు చేసి ఓడిపోలేదని, తప్పుడు ప్రచారంతో ఓటమి పాలైందన్నారు. ఎన్నికల ముందు అరచేతిలో వైకుంఠం చూపిన చంద్రబాబు అధికార నరకం చూపుతున్నారని అన్నారు. ఆరు నెలల్లో ఆలీబాబా అరడజను దొంగల్లా రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. జగనన్న పాలనలో ప్రతి సంక్షేమం తలుపు తట్టి మరీ పేదల దరిచేరేదని, నేడు ఏ సంక్షేమం ప్రజలకు చేరడం లేదన్నారు. సంపద సృష్టిస్తానని పలికి నేడు అప్పులపై అప్పులు చేస్తున్నారన్నారు. నాడు విద్యాంధ్రప్రదేశ్‌గా ఉన్న రాష్ట్రం నేడు మద్యాంధ్రప్రదేశ్ అయ్యిందన్నారు. జగన్ ఓడించే వరకు ఉద్యోగులు కంకణం కట్టుకున్నారని, నేడు ఎందుకు చంద్రబాబును గెలిపించామా? అని వారు బాధపడే పరిస్థితి ఎదురైందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆర్కే రోజా

కేసులు పెడతాం, ఉద్యోగం తీసేస్తాం అంటూ కూటమి ప్రభుత్వం భయపెట్టి లొంగదీసుకునే ప్రయత్నం చేస్తోందన్నారు. నగరి నియోజకవర్గంలో తాను, జిల్లాలో కరుణాకరరెడ్డన్న, రాష్ట్రంలో జగనన్న మీకు అండగా ఉంటామన్నారు. బిజినెస్ మెన్, ఫ్యామిలీ మెన్‌గా, పొలిటికల్ మెన్‌గా విజయం సాధించిన వ్యక్తి జగనన్న అని అలాంటి నాయకుని గొడుగు కింద మనమున్నామన్నారు.

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం

కూటమి ప్రభుత్వం వచ్చాక అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని పక్కన పెట్టి లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని తిరుపతి ఎంపీ గురుమూర్తి అన్నారు. కూటమి బెదిరింపులకు బెదరాల్సిన అవసరం లేదన్నారు. జగనన్న కోసం పోరాడే వారికి పార్టీలో సముచిత స్థానం, ప్రాధాన్యత ఉంటుందన్నారు. మనం ఒకరికొకరు తోడు కావాలన్నారు. ఏ ఒక్కరికి కష్టం వచ్చినా తామంతా అండగా ఉంటామన్నారు.



సమావేశంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోలు చూపుతున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

మోసాలు చేయడంలో బాబు సిద్ధహస్తుడు

ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబు సిద్ధహస్తుడని చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రజాదరణ కోల్పోతే టీడీపీ అధికారంలోకి రాలేదని, ఈవీఎం స్కామ్ వల్లే కూటమి అధికారంలోకి వచ్చిందన్నారు. జగనన్న విశ్వసనీయతను బాబు మోసాలు అధిగమించాయన్నారు. నేడు కూటమి ప్రభుత్వం హామీలు నెరవేర్చలేక చేతులెత్తేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్లు, ఎంపీపీలు, వైస్‌చైర్మన్లు, వైస్‌ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీ... బాదుడు గ్యారెంటీ

నగరి : బాబు ష్యూరిటీ..బాదుడు మాత్రం గ్యారెంటీ అని మాజీ మంత్రి ఆర్కేరోజా అన్నారు. విద్యుత్ ఛార్జీలు పెంచడంపై వైఎస్సార్ సీపీ శుక్రవారం నిర్వహించనున్న పోరుబాటకు సంబంధిత పోస్టర్లను ఆమె గురువారం విడుదల చేశారు. ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పాలనలో తొలి నాలుగేళ్ల విద్యుత్ బిల్లులు ఏ మాత్రం పెంచలేదన్నారు. ఒక్కసారి బిల్లులు పెంచినందుకే బాదుడే..బాదుడు అని ఊదరగొట్టిన టీడీపీ నేతలు, వారు అధికారంలోకి వచ్చిన ఆరునెలలకే విద్యుత్ చార్జీల బాదుడు బాదుతున్నారన్నారు. ఎన్నికల సమయంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ అన్నారని, అధికారంలోకి వచ్చాక అది బాబు ష్యూరిటీ.. బాదుడు గ్యారెంటీ అయ్యిందన్నారు. ఎన్నికల సమయంలో మరమగ్గ కార్మికులందరికీ 500 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చారని, అది నమ్మి నేతన్నలు టీడీపీని బలపరిచారన్నారు. ఉన్నది ఊడిందన్న చందంగా ఉచిత విద్యుత్ ఇవ్వక పోగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎలక్ట్రిసిటీ డ్యూటీలో ఇచ్చిన 96 పైసల రాయితీని కూడా తొలగించిందన్నారు. ఆరునెలల్లోనే వడ్డింపులిలా ఉంటే ఇక ఐదేళ్లు ఎలా ఉంటుందోనని ప్రజలు భయబ్రాంతులకు గురవుతున్నారన్నారు. విద్యుత్ బాదుడుపై వైఎస్సార్ సీపీ పోరాటం సాగించనుందన్నారు. విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ పోరుబాట నిర్వహిస్తున్నామన్నారు.

క్లుప్తంగా

ప్రసన్న వేంకటేశ్వరుని సేవలో పీవీ సింధు



అప్పలాయగుంటలో పీవీ సింధు దంపతులు

వడమాలపేట(విజయపురం): ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పద్మశ్రీ పీవీ సింధు గురువారం వడమాలపేట మండలంలోని అప్పలాయగుంట ప్రసన్న వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఇటీవల వెంకట దత్త సాయిని వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. గురువారం నూతన వధూవరులు అప్పలాయగుంటకు చేరుకుని, అభయహస్తంతో వెలసిన ప్రసన్న వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. మూడు నెలల క్రితం స్వామి వారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నామని, వివాహానంతరం దంపతులుగా వచ్చి స్వామివారికి మొక్కు తీర్చుకొన్నామని ఆమె చెప్పారు. అర్చకులు తీర్థ, ప్రసాదాలు అందజేశారు. ఆలయ సీనియర్ అసిస్టెంట్ బాలాజీ పాల్గొన్నారు.

తిరుపతితో మన్మోహన్ సింగ్‌కు విడదీయలేని బంధం



తిరుమల ఆలయంలో ధ్వజస్తంభానికి మొక్కుతున్న మాజీ పీఎం డాక్టర్ మన్మోహన్ సింగ్ (ఫైల్)

తిరుపతి సిటీ: మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ పలుమార్లు తిరుపతి జిల్లాలో పర్యటించారు. 2010 సెప్టెంబర్ ఒకటవ తేదీన మన్మోహన్ సింగ్ తిరుమలకు విచ్చేశారు. పద్మావతి అతిథి గృహంలో విశ్రాంతి అనంతరం సెప్టెంబర్ 2వ తేదీన శ్రీవారి సేవలో తరించారు. అనంతరం అదే రోజు రేణిగుంట విమానాశ్రయం చేరుకుని తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయానికి పునాది వేశారు. అలాగే శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ స్పేస్ సెంటర్‌ను పలుమార్లు సందర్శించారు. 2012 సెప్టెంబర్ 9న పీఎస్ఎల్‌వీ–సీ21 ప్రయోగానికి హాజరయ్యారు. ఆయన మరణ వార్త విన్న జిల్లా ప్రజలు, అధికారులు శోకతప్త హృదయంతో మునిగిపోయారు.

ఆలయ పరిసరాల్లో 200 సీసీ కెమెరాలు.. ఓ రాత్రికి ఆరుగురు భద్రతా సిబ్బంది.. పోలీసు ఔట్‌పోస్టు సిబ్బంది.. చీమ చిటుక్కుమన్నా.. తెలిసే పరిస్థితి బోయకొండ ఆలయంలో ఉంది. అంత భద్రత ఉన్నా.. నిఘా నిద్దరోయింది. ఫలితంగా ఓ మహిళ రాత్రంతా ఆలయంలో నిద్రపోయింది. వెరసి.. ఆలయ రక్షణపై అనుమానాలు కలుగుతున్నాయి. భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయి.



బోయకొండ గంగమ్మ ఆలయ ముఖచిత్రం

నిఘా నిద్దరోతోంది!

బోయకొండలో భద్రత హుష్‌కాకి
- రాత్రంతా గుడిలో నిద్రించిన మహిళ
- సీసీ కెమెరాల నిఘా ఎక్కడ?
- ఆలస్యంగా వెలుగు చూసిన ఉదంతం
- భక్తుల ఆగ్రహం

చౌడేపల్లె: జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో భద్రతను గాలికి వదిలేశారు. సీసీ కెమెరాలు, భద్రతా సిబ్బంది, అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో గర్భాలయంలో ఓ మహిళ మంగళవారం రాత్రంతా నిద్ర చేసిన సంఘటన ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. బోయకొండ భద్రతను వెక్కిరిస్తున్న ఈ సంఘటనపై భక్తులు మండిపడుతున్నారు. వివరాల్లోకి వెళితే.. సోమల మండలం గన్నావారిపల్లెకు చెందిన ఓ మహిళ(50) మంగళవారం బోయకొండ గంగమ్మ దర్శనం కోసం వచ్చింది. అమ్మవారిని దర్శించుకున్న ఆమె ప్రధాన ఆలయంలోని క్యూ పక్కన ఏర్పాటు చేసిన పోతురాజు విగ్రహం వద్ద కూర్చుంది. అక్కడే కొయ్యతో ఏర్పాటు చేసిన చెక్కల స్టాండ్ లోపలికి దూరి, రాత్రంతా అక్కడే నిద్రపోయింది. బుధవారం ఉదయం ఆలయంలో శుభ్రత పనులు చేయడానికి వచ్చిన ఓ మహిళా స్వీపర్ చెక్కల కింద బిత్తర చూపులతో పడుకున్న మహిళను చూసి గట్టిగా కేకలు వేసింది. అక్కడే ఉన్న సిబ్బంది చెక్కల కింద ఉన్న మహిళను బయటకు తీశారు. సంఘటనా స్థలానికి ఈఓ ఏకాంబరం చేరుకున్నారు. మహిళ వివరాలపై ఆరా తీసి, పోలీసుల సహకారంతో ఆమెను స్వగ్రామానికి పంపివేశారు. కాగా మొక్కు తీర్చుకోవడానికే ఆ మహిళ అలా చెక్కల మాటున ఆలయంలో నిద్ర చేసినట్లు తెలియవచ్చింది.

200 సీసీ కెమెరాల పర్యవేక్షణ గాలికి..

బోయకొండ కింద ప్రాంతం నుంచి ఆలయం వరకు భద్రత దృష్ట్యా 200 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. నిఘా వ్యవస్థను పటిష్టం చేయాలనే ఉద్దేశంతో మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి చొరవతో గత ప్రభుత్వంలో సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. బోయకొండను పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దాలనే ఆశయంతో ఇందుకోసం సుమారు రూ.200 కోట్లు నిధులు ఖర్చు చేశారు. ఆలయాన్ని అసిస్టెంట్ కమిషనర్ స్థాయి నుంచి డిప్యూటీ కమిషనర్ స్థాయికి పెంచి, ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు ప్రాంతాలకు సైతం బోయకొండ ప్రాముఖ్యతను తెలియజేశారు. ప్రస్తుతం ఆ కెమెరాల పర్యవేక్షణ పనితీరును గాలికి వదిలేశారు.

భద్రతా లోపమే కారణమా?

రూ.కోట్లలో ఆదాయం సమకూరుతున్న ఆలయంలో భద్రత లోపంతోనే మహిళ ఆలయంలో నిద్రించిందని భక్తులు మండిపడుతున్నారు. ఒంటరి మహిళ ఏ ఉద్దేశంతో ఆలయంలో ఉందో తెలియదు కానీ, ఆమె ఏమైనా దురుద్దేశంతో మూలవిరాట్‌కు ఏదైనా ఇబ్బంది కలిగించి ఉంటే ఎంత ఘోర అపచారం జరిగి ఉండేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓ మహిళ రాత్రంతా నిద్రపోయిందంటే, ఆలయానికి తాళాలు వేసే సిబ్బంది నిర్లక్ష్యంతోపాటు సెక్యూరిటీ సిబ్బంది ఏ తరహాలో విధులు నిర్వహిస్తున్నారో అర్థమవుతోందని పలువురు చర్చించుకుంటున్నారు. ఆరుగురు సెక్యూరిటీ సిబ్బంది విధుల్లో ఉండగా కేవలం విధులకు హాజరైనట్లు ఫొటోలు పెట్టి, డుమ్మా కొట్టడంతోపాటు హాయిగా నిద్రపోతున్నారని, అలాంటప్పుడు నైట్ సెక్యూరిటీ ఎందుకని భక్తులు ప్రశ్నిస్తున్నారు. వీరితో పాటు పోలీస్ ఔట్ పోస్టు సిబ్బంది పనితీరుపై పలు ఆరోపణలు వస్తున్నాయి.

భద్రతా సిబ్బందిపై చర్యలు

బోయకొండ గంగమ్మ ఆలయంలో ఓ మహిళ రాత్రంతా చెక్కల కింద నిద్రపోయిన విషయం వాస్తవమే. ఈ ఘటనపై విచారణ చేపట్టి అందుకు బాధ్యులైన భద్రతా సిబ్బందిపై చర్యలు తీసుకుని, జరిమానా విధించాం. ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవడంతోపాటు సిబ్బంది విధుల కేటాయింపులో మార్పులు చేశాం.

– ఏకాంబరం, ఈఓ, బోయకొండ

రాచూరులో ఒంటరి ఏనుగు హల్‌చల్



ఏనుగు ధ్వంసం చేసిన అరటితోట

యాదమరి(కాణిపాకం): మండలంలోని రాచూరు ప్రాంతంలో ఒంటరి ఏనుగు హల్‌చల్ చేస్తోంది. రెండు రోజులుగా ఆ ప్రాంతంలో సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తోంది. పంటలను ధ్వంసమవుతున్నాయి. ఈ నేపథ్యంలో అటవీశాఖ అధికారులు రంగంలోకి దిగారు. ఆ ఒంటరి ఏనుగును అటవీ ప్రాంతానికి మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నారు. స్థానిక గ్రామస్తులను అప్రమత్తం చేస్తున్నారు.

5, 6 తేదీల్లో సీఎం కుప్పం పర్యటన

కుప్పం: ముఖ్యమంత్రి చంద్రబాబు జనవరి 5, 6వ తేదీల్లో కుప్పంలో పర్యటించనున్నట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి. రెండు రోజుల పాటు కుప్పం, గుడుపల్లె మండలాల్లో ఆయన పర్యటిస్తున్నట్లు పేర్కొన్నాయి. గుడుపల్లె మండలం ఇండస్ట్రియల్ ఏరియాలో పలు పరిశ్రమలకు శంకుస్థాపనలు, కుప్పం పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయనున్నట్లు తెలిపాయి.

31లోపు సిలబస్ పూర్తి చేయాలి

- పకడ్బందీగా ఇన్‌స్పైర్ మనక్ సైన్స్ ఫెయిర్‌లు నిర్వహించండి
- హెచ్‌ఎంల సమావేశంలో డీఈఓ వరలక్ష్మి వెల్లడి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ప్రతి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ నెల 31వ తేదీలోపు తప్పనిసరిగా పదో తరగతి సిలబస్ పూర్తి చేయాలని డీఈఓ వరలక్ష్మి ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలో కట్టమంచిలో ఉన్న ఆర్‌కే మోడల్ పాఠశాలలో హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. డీఈఓ మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ పాఠశాలలో అన్ని సబ్జెక్టుల సిలబస్ ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలన్నారు. సిలబస్ పూర్తి చేయడంలో టీచర్లు అలసత్వం వహిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. ఏ పాఠశాలలోనైనా సబ్జెక్టు టీచర్లు ఉద్యోగ విరమణ చెంది ఉంటే సమీప పాఠశాల టీచర్లతో సిలబస్ పూర్తి చేయించాలన్నారు. జనవరి ప్రారంభం నుంచి పదో తరగతి విద్యార్థులు రివిజన్ ప్రారంభించాలన్నారు. జిల్లాలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ఈ నెల 27వ తేదీన ఇన్‌స్పైర్ మనక్ సైన్స్ కార్యక్రమాలు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. చిత్తూరు డీవైఈఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ పదో తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రతి పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఇన్‌స్పైర్ మనక్ కార్యక్రమాలు ఈ నెల 28 న మండల స్థాయిలో, ఈ నెల 31 న జిల్లా స్థాయిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పీఎం శ్రీ పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గౌడ్స్ కమిటీలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో చిత్తూరు ఎంఈఓలు సెల్వరాజ్, మోహన్, ఆర్‌కే మోడల్ పాఠశాల కరస్పాండెంట్ కోమల, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

జిల్లాకు చేరిన 144 ట్రాన్స్‌ఫార్మర్లు

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో ఉమ్మడి చిత్తూరు జిల్లా స్టోర్స్‌కు విద్యుత్ పరికరాలు వచ్చాయని ట్రాన్స్‌కో ఎస్ఈ ఇస్మాయిల్‌అహ్మద్ తెలిపారు. వ్యవసాయ సరీస్సులకు వినియోగించే 25 కేవీ సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్లు 144 వచ్చాయన్నారు. వీటితో పాటు బ్రేకర్స్ 9 వచ్చాయని, వీటిని సీనియార్టీ ప్రకారం రైతులకు ఇవ్వాలని ఆదేశించారు. ఏఈలు వర్క్ఆర్డర్లు పెట్టి మెటీరియల్స్ డ్రా చేసుకోవాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో పడిమెట్ల పూజోత్సవం



సదుం: ప్రత్యేకాలంకారంలో పద్దెనిమిది మెట్లు



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ద్వారకనాథ రెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి

సదుం: మండలంలోని ఎర్రాతివారిపల్లెలో బురుజుబండపై వెలసిన కోటమల్లై అయ్యప్పస్వామి ఆలయంలో గురువారం సాయంత్రం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పడిమెట్ల పూజోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సుగంధభరిత పుష్పాలు, విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయంలోని పద్దెనిమిది మెట్లను వివిధ రకాల పుష్పాలు, నేతి దీపాలు, చందన, కుంకుమ, ఫలాలతో తీర్చిదిద్దారు. ఆలయ మేల్‌శాంతి, తంత్రి నారాయణన్ నంబూద్రి కేరళ సాంప్రదాయ పద్ధతులతో ప్రతి మెట్టుకు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అయ్యప్పస్వాముల భజనలు భక్తులను అలరించాయి. పడిమెట్ల పూజోత్సవం తిలకించేందుకు పలు ప్రాంతాల నుంచి అయ్యప్ప స్వాములు, భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. పడిమెట్ల పూజ అనంతరం అయ్యప్పకు విశేషాలంకారం చేసి పూజలు చేశారు. ప్రత్యేకాలంకారంలో ఉన్న స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. అయ్యప్పనామ స్మరణలతో ఆలయ పరిసర ప్రాంతాలు మార్మోగాయి. భక్తులకు ఆలయంలో అన్నదానం చేశారు.

ఆకట్టుకున్న ప్రత్యేక మండపం

ఆలయ ఆవరణలో తొలిసారిగా ఏర్పాటు చేసిన అయ్యప్పస్వామి ప్రత్యేక మండపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అరటి బెరడుతో మండపం రూపొందించి, కొబ్బరి ఆకులు, మొక్కజొన్న, అనాస, గుమ్మడి, పుష్పాలు తదితర వాటితో అలంకరించారు. అందులో అయ్యప్ప, శివ పార్వతులు, వినాయక, సుబ్రమణ్య స్వామి, వేంకటేశ్వర స్వామి చిత్రపటాలను ఏర్పాటు చేశారు. ఇందులో ఫొటోలు తీసుకునేందుకు భక్తులు ఆసక్తి చూపారు. కార్యక్రమంలో పెద్దిరెడ్డి పద్మావతమ్మ, స్వర్ణలతమ్మ, ఎంపీ మిథున్ రెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్ప, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, మాజీ ఎంపీపీ ఇందిరమ్మ, కవితమ్మ, రుక్మిణమ్మ, వేణుగోపాల్ రెడ్డి, అభినయ్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి, కృష్ణమూర్తి, పులిచర్ల ఎంపీపీ సురేంద్రనాథ రెడ్డి, పలువురు ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

అన్నకొడుకుపై దాడి కేసులో చిన్నాన్నకు జైలు

చిత్తూరు అర్బన్: అన్న కొడుకుపై దాడి చేసి గాయపరిచిన కేసులో చిన్నాన్నకు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ చిత్తూరులోని ప్రత్యేక సంచార న్యాయస్థానం గురువారం తీర్పునిచ్చింది. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్వాతి కథనం మేరకు.. గంగాధరనెల్లూరు మండలం పీబీ అగ్రహారం గ్రామానికి చెందిన గణేష్, మంజునాథ్ అన్నదమ్ములు. వీరికి కొంతకాలంగా కుటుంబ తగాదాలున్నాయి. 2023 ఫిబ్రవరి 21వ తేదీన గణేష్ కుమారుడు ప్రేమ్‌కుమార్ వీధిలో నడిచి వెళుతుండగా.. ఓ ఇనుప బకెట్ తీసుకొచ్చిన మంజునాథ్ దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో ప్రేమ్‌కుమార్ తలకు తీవ్ర గాయమవడంతో ఆస్పత్రికి తరలించారు. ప్రేమ్‌కుమార్ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుపై గంగాధరనెల్లూరు పోలీసులు మంజునాథ్‌పై కేసు నమోదు చేశారు. నిందితుడిపై నేరం రుజువుకావడంతో ఏడాది జైలుశిక్ష, రూ.8 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి శ్రీనివాసులు తీర్పునిచ్చారు.

ప్రేమజంట ఆత్మహత్యాయత్నం

చిత్తూరు అర్బన్: నగరంలో ప్రేమజంట గురువారం మరుగుదొడ్లు కడిగే హార్పిక్ తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించారు. టూటౌన్ సీఐ నెట్టికంటయ్య కథనం మేరకు.. చంద్రగిరి మండలానికి చెందిన జి భరత్ (21), కర్నూలు జిల్లాకు ఆదోనికి చెందిన రాజేశ్వరి (19) తిరుపతి రెడ్డి అండ్ రెడ్డి కాలనీలోని యూవీ కార్డికేర్ హాస్పిటల్‌లో పనిచేస్తున్నారు. ఈ క్రమంలో వీరిద్దరూ ప్రేమలో పడ్డారు. ఇంట్లో తెలియకుండా గురువారం చంద్రగిరిలోని మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో పెళ్లి చేసుకున్నారు. సాయంత్రం చిత్తూరు నగరం రామ్‌నగర్‌కాలనీలోని తన స్నేహితుల వద్దకు వచ్చారు. వాళ్లు ఫోన్ తీయకపోవడంతో భయబ్రాంతులకు గురయ్యారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురై వెంట తెచ్చుకున్న హార్పిక్‌ను తాగేశారు. ఇది గమనించిన స్థానికులు వెంటనే ఆ జంటను చిత్తూరు జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి సీఎంసీకి తీసుకెళ్లారు. కాగా రాజేశ్వరి పరిస్థితి విషయంగా ఉన్నట్లు తెలిసింది.

చోరీ సొత్తు 114 గ్రాముల బంగారం రికవరీ



బంగారంతో పాటు అరెస్టు చూపుతున్న పోలీసులు

గుడిపాల: ఓ వ్యక్తి చోరీ చేసిన 114 గ్రాముల బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకోవడంతోపాటు అతన్ని అరెస్టు చేసినట్లు గుడిపాల ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. గుడిపాల మండలంలోని పాపసముద్రం గ్రామానికి చెందిన సుబ్రమణ్యంరెడ్డి ఇంట్లోకి గత 17వ తేదీ రాత్రి గుర్తుతెలియని వ్యక్తి చొరబడి ఇంటి యజమానిని కాళ్లు చేతులు కట్టేసి బంగారాన్ని దోచుకెళ్లాడు. అతను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. దీనిపై గుడిపాల ఎస్ఐ రామ్మోహన్ సిబ్బందితో విచారణ ప్రారంభించారు. ఇందులో భాగంగా శ్రీనివాసులురెడ్డి(45)గా నిర్ధారించారు. నెల్లూరు జిల్లా విడవలూరు మండలానికి చెందిన ఇతను చేపలు, రొయ్యలు వ్యాపారం చేస్తుంటాడని రెండేళ్లుగా వ్యాపారంలో నష్టాలు రావడంతో డబ్బులు సులభంగా సంపాదించాలని ఆలోచిస్తుండగా తిరుపతి నుంచి తిరువణ్ణామలైకు బస్సులో వెళ్తుండగా అదే బస్సులో సుబ్రమణ్యంరెడ్డి అతనికి పరిచయం అయ్యాడు. తనది ఒంగోలు అని, తన పేరు కిషోర్ అని చెప్పి పరిచయం చేసుకుని కొన్నిరోజులు ఫోన్‌లో మాట్లాడుతూ డిసెంబర్ 17వ తేదీన పాపసముద్రంలోని సుబ్రమణ్యంరెడ్డి ఇంటికి వచ్చి వారితో పాటు ఇంట్లో భోజనం చేసి వారు వృద్ధాప్యంలో ఉండడాన్ని ఆసరా చేసుకుని వారికి మత్తుమందు ఇచ్చి వారివద్ద ఉన్న 114 గ్రాముల బంగారు ఆభరణాలను దోచుకునివెళ్లాడు. గురువారం అతన్ని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

జైళ్లశాఖ పెట్రోల్‌బంక్ పనుల పరిశీలన

పలమనేరు: పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఆనుకుని ఉన్న పాత సబ్‌జైల్ వద్ద జైళ్లశాఖ, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐఓసీ) సంయుక్త ఆధ్వర్యంలో పెట్రోల్‌బంకు త్వరలో ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించి పలమనేరులో జరుగుతున్న పనులను జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు గురువారం పరిశీలించారు. ఇక్కడి ఏర్పాట్లపై ఆశాఖ సూపరింటెండెంట్ వేణుగోపాల్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. 2011లో ఇక్కడున్న సబ్‌జైల్‌ను మూసివేసి, ఇక్కడి ఖైదీలను మదనపల్లె, పీలేరు జైళ్లకు తరలిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే జిల్లా కేంద్రంతోపాటు ఇక్కడ, పుత్తూరులోనూ పెట్రోల్ బంకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయన్నారు. ఇక్కడున్న జైళ్లశాఖ స్థలంలో 50 సెంట్లలోని ఈ భవనం ఖాళీగానే ఉండడంతో పట్టణంలోని నడిబొడ్డులో రూ.కోట్ల విలువ చేసే ఈ స్థలంలో పెట్రోల్‌బంకును ఏర్పాటు చేయాలని జైళ్లశాఖ నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ పెట్రోల్ బంకులో జీవితఖైదు అనుభవిస్తున్న ఖైదీని పర్యవేక్షకుడిగా నియమించనున్నట్లు ఆయన తెలిపారు. ఇది ఏర్పాటైతే పట్టణవాసులకు ఉపయోగకరంగా మారనుందని తెలిపారు. ఆయన వెంట పలమనేరు డీఎస్పీ ప్రభాకర్, సీఐ నరసింహరాజు, ఎస్ఐ స్వర్ణతేజ తదితరులున్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఐదుగురి అరెస్టు

చిత్తూరు అర్బన్: నగరంలో గంజాయి విక్రయిస్తున్న ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల్లో కెఎం.ఉమాశంకర్ (49), ఇ.జగదీష్ (22), ఎస్ఏ.మహ్మద్ షుహేలీ (28), ఎస్.గౌస్ ఖాన్ (23), ఎస్.చేతన్‌ప్రసాద్ (28) ఉన్నారు. గురువారం వన్‌టౌన్ సీఐ జయరామయ్య ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. ఎన్టీఆర్ బస్టాండ్ వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించగా ఇద్దరు వ్యక్తులు గంజాయి ప్యాకెట్లతో పోలీసులకు దొరికారు. వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తే.. జింకల పార్కు సమీపంలో తాము వాటిని కొనుగోలు చేసినట్లు చెప్పడంతో అక్కడ దాడులు చేశారు. అక్కడ ముగ్గురు వ్యక్తులు గంజాయి పొట్లాలుగా వేరు చేస్తుండగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. మొత్తం ఐదుగురు నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద ఉన్న 2.60 కిలోల గంజాయిని పోలీసులు సీజ్ చేశారు.

సాహితీ పురస్కారాలకు ఇద్దరి ఎంపిక



సాంబమూర్తి



శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : గంటా కమలమ్మ సాహితీ పురస్కారాలకు ఇద్దరు ఎంపికైనట్లు పురస్కార వ్యవస్థాపకులు, అరసం జిల్లా అధ్యక్షుడు గంటామోహన్ వెల్లడించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏటా అందజేసే గంటా కమలమ్మ సాహితీ పురస్కారాలు–2024కు శ్రీకాకుళం జిల్లాకు చెందిన సాంబమూర్తి, తెలంగాణ రాష్ట్రం నల్గొండకు చెందిన తుల శ్రీనివాసులు ఎంపికయ్యారన్నారు. సాంబమూర్తి (నాలుగు రెక్కల పిట్ట), శ్రీనివాసులు (చింతల తొవ్వ) అనే కవితా సంపుటాలను రచించారన్నారు. పురస్కారానికి నిర్వహించిన పోటీలో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి 35 కవితా సంపుటాలు అందినట్లు చెప్పారు. న్యాయ నిర్ణేతలుగా అనంతపురం జిల్లాకు చెందిన సాహితీవేత్త డాక్టర్ రాధేయ, హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ ఎస్.రఘు వ్యవహరించారన్నారు. అద్భుతమైన కవితా సంపుటాలు పంపిన కవులందరికీ ధన్యవాదాలు తెలిపారు. 2025 జనవరిలో నిర్వహించే సాహితీ కార్యక్రమంలో పురస్కార గ్రహీతలకు రూ.10 వేలు నగదు, పురస్కారం అందజేయనున్నట్లు వెల్లడించారు.

క్యాన్సర్ పరీక్షల్లో అలసత్వం వద్దు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

- సమావేశంలో కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా క్యాన్సర్ పరీక్షల నిర్వహణలో అలసత్వం వహించవద్దని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్‌సీడీ–సీడీ 3.0 (నాన్ కమ్యునికేబుల్ డిసిసెస్) సర్వే పకడ్బందీగా నిర్వహించాలన్నారు. సర్వే నిర్వహణలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లాలోని ప్రతి ఒక్కరి ఇంటి వద్దకు వెళ్లి పరీక్షలు నిర్వహించాలన్నారు. పరీక్షల అనంతరం ఆరోగ్య సమాచారాన్ని డిజిటలైజేషన్ తప్పనిసరిగా చేయాలని తెలిపారు. ఈ సర్వేలో ప్రధానంగా రక్తపోటు(బీపీ), బ్లడ్ గ్లూకోస్(మధుమేహం), హిమోగ్లోబిన్ పరీక్షించాలన్నారు. మహిళల్లో క్యాన్సర్‌కు సంబంధించి ఎటువంటి లక్షణాలు కనిపించినా గైనకాలజిస్టులు పరీక్షించి, స్క్రీనింగ్ కోసం తిరుపతి రుయాకు పంపాలన్నారు. ఈ ప్రక్రియపై ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు క్యాన్సర్‌కి సంబంధించిన ప్రశ్నావళిని పూరించడంలో అవగాహన కలిగి ఉండాలన్నారు. మెడికల్ ఆఫీసర్లు ఎప్పటికప్పుడు సిబ్బంది సందేహాలను నివృత్తి చేయాలని తెలిపారు. జిల్లాలో పుట్టిన బిడ్డ నుంచి ఐదే ళ్లల్లోపు పిల్లల పూర్తి సమాచారాన్ని మెడికల్ ఆఫీసర్లు తమ వద్ద అందుబాటులో ఉంచుకోవాలన్నారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సుధారాణి, డీసీహెచ్ఎస్ ప్రభావతి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటప్రసాద్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అవార్డు అభినందనీయం

జాతీయ స్థాయిలో ఉత్తమ ఆరోగ్య పంచాయతీ అవార్డు పొందిన బొమ్మసముద్రం పంచాయతీ సర్పంచ్ రఘునాథ్‌ను కలెక్టర్ సుమిత్ కుమార్ అభినందించారు. గురువారం కలెక్టరేట్‌లో అభినందన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో బొమ్మసముద్రం ఉత్తమ ఆరోగ్య పంచాయతీగా ఎంపికై అవార్డు స్వీకరించడం అభినందనీయమన్నారు. గ్రామ పంచాయతీని ప్రగతి పథంలో నడిపించడంతో పాటు మరింత పకడ్బందీగా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బొమ్మసముద్రం పంచాయతీని ఆదర్శంగా తీసుకుని, మరిన్ని పంచాయతీలు అవార్డులు సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. డీపీఓ సుధాకర్‌రావు, డీఎల్‌పీఓ పార్వతి తదితరులు పాల్గొన్నారు.